

## ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు

గరుగుబిల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. మంగళవారం రావివలస, కారివలస గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు తర్వాత మిగతా పంటలను పండిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. శ్రీవరి సాగుతో ఆర్థికంగా బలోపేతం కావొచ్చన్నారు. రబీలో అపరాలను సాగు చేసుకోవాలని, ఇందుకు అవసరమైన విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నామని తెలిపారు. అంతర పంటల సాగుతో ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ బడులకు మంచి రోజులు

- పాఠశాలలు, ఎంఆర్‌సీల నిర్వహణపై సర్కారు దృష్టి
- భారీగా నిధులు మంజూరు
- వైసీపీ పాలనలో సుద్దముక్కలకూ నిధులివ్వని వైనం
- ఉపాధ్యాయుల చేతి సొమ్ముతో కొనుగోలు
- తాజాగా కూటమి చర్యలతో జిల్లావాసులు హర్షం

పార్వతీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులొచ్చాయి. కూటమి సర్కారు వాటి నిర్వహణకు భారీగా నిధులు మంజూరు చేసింది. ఎంఆర్‌సీలపై కూడా దృష్టి సారించింది. విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా సర్కారు అడుగులు వేస్తుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా గత వైసీపీ సర్కారు పాఠశాలల నిర్వహణను గాలికొదిలేసింది. వాటి అభివృద్ధి మాటెలా ఉన్నా.. కనీసం సుద్దముక్కలకు కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులతో పాఠశాలలకు అవసరమైన వాటిని సమకూర్చుకునే వారు. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం తాజాగా పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించింది. సీఎం చంద్రబాబు నిర్ణయంపై సర్కారీ పాఠశాలలకు పూర్వ వైభవం రానుందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

### నిధుల మంజూరు ఇలా..

- జిల్లాలో 1,597 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 1,18,530 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా



'మన్యం'లో 1,029 పాఠశాలల నిర్వహణకు గాను ప్రభుత్వం సుమారు మొదటి విడతగా రూ.2.16 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే విద్యాశాఖ రూ.1.08 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన బోధన సామగ్రిని సమ కూర్చుకోవచ్చు.

- మన్యంలో 15 మండల విద్యా వనరుల కేంద్రాల (ఎంఆర్‌సీ) నిర్వహణకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులు, తదితర వాటి కోసం జిల్లాకు సుమారు రూ.19.50 లక్షలను విడుదల చేశారు. దీంతో ఎంఆర్‌సీలకు ఊపిరిపోసినట్లయ్యింది.

### గత వైసీపీ పాలనలో..

జిల్లాలో మండల విద్యా వనరుల కేంద్రాలకు కూడా గత వైసీపీ సర్కారు నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఎంఈవోలు ప్రతినెలా తమ జేబులో సొమ్మును వెచ్చించే వారు. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపులు కూడా వారికి భారంగా మారేవి. కొన్ని మండలాల్లో ఉపాధ్యా యులు కొంత మొత్తం ఎత్తుకుని ఎంఆర్‌సీ నిర్వహణకు సహకరించేవారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో ఉపాధ్యాయులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నిధులు మంజూరయ్యాయి

ప్రభుత్వ పాఠశాలలు, ఎంఆర్‌సీల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో విద్యాశాఖ తొలివిడతగా పాఠశాలలకు రూ.1.08 కోట్లు, ఎంఆర్‌సీలకు రూ. 19.50 లక్షలను విడుదల చేసింది. ఆ నిధులతో వాటికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేయనున్నాం. బిల్లులను కూడా చెల్లించనున్నాం.

- ఎన్.తిరుపతి నాయుడు, డీఈవో



## సాలూరుకు డిప్యూటీ సీఎం రాక!

పార్వతీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటన దాదాపు ఖరారైనట్లు సమాచారం. సాలూరు నియోజకవర్గం సిరివర గిరిజన గ్రామంలో బీటీ రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్టు తెలిసింది.



ఆయన పర్యటన గురించి జిల్లా యంత్రాంగం అధికారికంగా ప్రకటించ లేదు. అయితే ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రానున్న నేపథ్యంలోనే ముందస్తుగా గిరిజన ఇంజనీరింగ్‌శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, గిరిజ ఇంజనీరింగ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మణిరాజు మంగళవారం సిరివర తదితర ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలుస్తోంది.

## ప్రజాభిప్రాయం మేరకు రీ సర్వే

- ఉత్తరాంధ్ర రెవెన్యూ సదస్సులో మంత్రి సత్య ప్రసాద్
- హాజరైన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ , పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయం మేరకే రీ సర్వే చేపడతామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర రెవెన్యూ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా పకబ్బందీగా రీ సర్వే చేపడతామన్నారు. గతంలో జరిగిన ప్రతి తప్పును సరిదిద్దుతామని , రైతులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌శాఖతో అనుసంధానం చేస్తూ రెవెన్యూ రికార్డులన్నింటినీ పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేస్తామన్నారు. ఫిబ్రవరిలో విశాఖలో ప్రాంతీయ రెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ఆలోపు ప్రజల నుంచి వచ్చిన ప్రతి రెవెన్యూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పలు రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సదస్సులో హోం మంత్రి అనిత, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, జేసీ శోభిక, డీఆర్‌వో హేమలత తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో కలెక్టర్, ఎమ్మెల్యే

## రాష్ట్రపతికి ఘన స్వాగతం

- పట్టు వస్త్రాలతో ఆహ్వానం పలికిన మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం/సాలూరు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మంగళగిరి అఖిల భారత వైద్య విద్యా సంస్థ (ఎయిమ్స్)లో మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సాదరంగా ఆమెను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి రాష్ట్రపతికి మంగళగిరి చేనేత పట్టు వస్త్రాలతో పాటు అరకు కాఫీ, జీసీసీ తేనెను అందించారు. రాష్ట్రపతిని కలిసే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దీనిపై జిల్లా కూటమి శ్రేణులు, ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆ ప్రాంతాలు.. కాఫీ తోటలకు అనుకూలం

6లో

- సాగు చేస్తే గిరిజనులకు ఎంతో మేలు

## ఆధ్యాత్మిక శోభ

- ధనుర్మాస మహోత్సవాలు, క్రిస్మస్‌తో సందడి
- జిల్లాలో పండగ వాతావరణం

6లో

## 200 ఎకరాల్లో పట్టు సాగు

- ఏడీ సాల్మన్‌రాజ్

సీతంపేట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 200 ఎకరాల్లో పట్టు సాగవుతున్నట్లు సెరీకల్చర్ ఏడీ సాల్మన్‌రాజ్ చెప్పారు. మంగళవారం సీతంపేటలోని పట్టు రీలింగ్ యూనిట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో 70 మంది రైతులు పట్టుసాగు చేస్తున్నట్లు తెలిపారు. సీతంపేట మండలంలో 50 ఎకరాల్లో పట్టు సాగవుతుందన్నారు. నాణ్యత బట్టీ కేజీ రూ.500 నుంచి రూ.600ల వరకు కొనుగోలు చేస్తున్నామని, నెలకు 70కిలోల వరకు పట్టు తయారవుతుందని వెల్లడించారు. పట్టు గూళ్ల షెడ్డుల నిర్మాణాలకు ఎస్సీఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఇతర వర్గాలకు 70శాతం సబ్సిడీ ఉంటుదని చెప్పారు. చిన్న షెడ్డులకు రూ.3.20లక్షలు, పెద్ద షెడ్డులకు రూ.4.50 లక్షల వరకు ఇస్తామని తెలిపారు.

## డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- యూటీఎఫ్ డిమాండ్
- ఐటీడీఏ ఎదుట నిరసన

బెలగాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్ డిమాండ్ చేశారు. సీఆర్టీ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఐటీడీఏ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐటీడీఏ పరిధిలో 66 మంది ఉపాధ్యాయులను డిప్యుటేషన్లపై సుదూర ప్రాంతాలకు వేయడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులు లేకపోతే గిరిజన ప్రాంతాల్లో పిల్లలు విద్యకు దూరమవుతారని తెలిపారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు భాస్కరరావు, రమేష్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం



అడవితల్లి విగ్రహం ఎదుట భిక్షాటన చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

## డిమాండ్లు నెరవేర్చండి

- గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వినూత్న నిరసన

సీతంపేట రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నినదించారు. మంగళవారం సీతంపేటలో అడవితల్లి విగ్రహం వద్ద భిక్షాటన చేపట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. సీఆర్‌టీలతో సమానంగా తమకు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు గణేష్, మోహనరావు, రవి, భవానీ, భాగ్యలక్ష్మి, రాజేశ్వరీ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



6లో

## అడవి బిడ్డల అరణ్య రోదన

- దశాబ్దాలుగా మారని బతుకులు
- అభివృద్ధికి ఆమడ దూరం
- మౌలిక వసతులు కరువు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

# చినుకు..రైతుల్లో వణుకు

- జిల్లాపై అల్పపీడన ప్రభావం
- మారిన వాతావరణం
- అక్కడక్కడా చిరుజల్లులు
- పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు

పాలకొండ/గరుగుబిల్లి/సాలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై అల్పపీడన ప్రభావం కనిపిస్తోంది. మంగళవారం ఉదయం నుంచే వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులతో అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించడంతో అన్నదాతల్లో అలజడి నెలకొంది. దీంతో చేతికందొచ్చిన పంటలను కాపాడుకోవడం కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

### ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ కింద రైతులు రెండు లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. సీజన్ ప్రారంభం నుంచి అష్టకష్టాలు ఎదుర్కొని పంటను దక్కించుకున్న వారికి వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది రోజుల కింద ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడిన అన్నదాతలు తాజా అల్పపీడనం హెచ్చరికలతో దిగులు చెందుతున్నారు. ఈనెల 19 నుంచి 23 వరకు జిల్లాలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉండడంతో మరింత టెన్షన్ పడుతున్నారు. పొలాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొంతమంది నూర్పులు వాయిదా వేశారు. మరికొంతమంది పొలాల్లోని వరికుప్పలపై టార్పాలిన్లు కప్పి సంరక్షణ చేపడుతున్నారు. ఇంకొందరు నూర్పిడి చేపడుతున్నారు. ధాన్యం సిద్ధం చేసి మిల్లులకు తరలిం చేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ తరుణంలో వాతావరణం ప్రతి కూలంగా మారడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరికుప్పలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మరోవైపు జిల్లా యంత్రాంగం రైతులను అప్రమత్తం చేస్తోంది. పంట సంరక్షణ చర్యలు చేపట్టాలని, ధాన్యం నిల్వలు సమీపంలోని రైతుసేవా కేంద్రాలకు తరలించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతానికి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. జిల్లాలో ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఉండేందుకు తగిన సూచనలివ్వాలని 15 మండలాల ఏవోలు, విలేజ్ వ్యవసాయ సహాయకులకు జేసీ శోభిక, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ మంగళవారం టెలికాన్ఫరెన్స్‌లో మార్గదర్శకాలు ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంట కోత కోసినట్టు వ్యవసాయశాఖ వర్గాలంటున్నాయి. కొనుగోలు కేంద్రాలకు దాదాపు లక్ష టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించినట్టు అంచనా. మరికొందరు ప్రైవేట్ వర్తకులకు సైతం విక్రయించారు.



కల్లాల్లోనే ఉన్న ధాన్యం బస్తాలతో రైతులు ఇలా..



వరి ఓదెలను కుప్పలుగా వేసుకుంటున్న రైతులు

### పెరిగిన చలి...

అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఆకాశాన్ని కారు మబ్బులు కమ్మేయగా.. చల్లని గాలులతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 17 నుంచి 15 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదువుతన్నాయి. సీతంపేట, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సాలూరు, పాచిపెంట తదితర ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉంది. ఆయా ప్రాంతవాసులు చలిమంటలు వేసుకోవాల్సి వస్తోంది.

### వరి కోతలొద్దు

వాతావరణ పరిస్థితులు చక్కబడే వరకు వరి కోతలు కోయవద్దు. కుప్పలు వేసిన వారు నూర్పులు చేయవద్దు. ఇప్పటికే నూర్పులు చేసిన వారు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి. ఆరుబయట ఉన్న వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పాలి. మండలాల్లో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను అధికారుల అనుమతితో రైతులు తీసుకెళ్లవచ్చు. మండల వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

# అడవి బిడ్డల అరణ్య రోదన

అదో గిరి శిఖర గ్రామం. అక్కడో గ్రామం ఉందని అధికారులకు తెలియదంటే అతిశయోక్తికాదు. నేటి వరకు ఒక్క అధికారి కూడా ఆ గ్రామానికి పోలేదు. తమ సమస్యలను చెప్పు కోవడానికి అధికారుల వద్దకు వచ్చి గిరిజనులు మొరపెట్టుకున్నా, ఎన్ని వినతులు ఇస్తున్నా బుట్టదాఖలే అవుతున్నాయి. నేరాలు, ఘోరాలు వంటి ఘటనలు జరిగితే పోలీసులు అష్టకష్టాలు, ఆపసోపాలు పడి అక్కడకు చేరుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమాలంటే వారికి తెలియదు. నాయకుల దృష్టిలో వారు ఒట్టి ఓటర్లు మాత్రమే. ఎన్నికల సమయంలోనే అక్కడకు వెళ్తారు. వారి ఓట్లతో పదవులు అనుభవిస్తున్న పాలకులు ఆ గ్రామ అభివృద్ధిని విస్మరిస్తున్నారు. మెంటాడ మండలంలోని ఎగువ మిర్తివలస గిరిజనుల దుర్భర బతుకుపై 'ఆంధ్రజ్యోతి' కథనం.


తాగునీటిని ఇంటికి తీసుకెళ్తున్న బాలికలు


మైదాన ప్రాంతంలో నిత్యావసరాలు కొనుగోలు చేసి కొండ ఎక్కి గ్రామానికి వెళ్తున్న గిరిజన మహిళలు


ఊటనీరు పడుతున్న గిరిజన మహిళలు

- దశాబ్దాలుగా మారని బతుకులు
- అభివృద్ధికి ఆమడం దూరం
- కనీస మౌలిక వసతులు కరువు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కన్నీరుపెడుతున్న ఎగువ మిర్తివలస గిరిపుత్రులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

మెంటాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

కూనేరు పంచాయతీలోని ఎగువ మిర్తివలస గ్రామంలో సుమారు 30 కుటుంబాలు జీవిస్తున్నాయి. దాదాపు 80 మంది జనాభా ఉన్నారు. పంచాయతీ కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని ఈ గిరిజన గ్రామాన్ని పట్టించుకునే నాథుడు లేడు. దశాబ్దాల తరబడి వీరివి తడబాటు బతుకులే. మట్టి ఇళ్లే వీరి ఆవాసాలు. పొట్ట పోసుకోవడానికి పోడు వ్యవసాయమే దిక్కు. గ్రామంలో పక్కా ఇళ్లు కనిపించవు. రోడ్డు, కాలువలు అసలే లేవు. కొండల నుంచి జాలువారిన ఊటనీరే వారికి తాగునీరు. పాఠశాల లేకపోవడంతో పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఎవరికైనా జబ్బు చేస్తే పసర వైద్యమే దిక్కు. పిల్లలకు పౌష్టికాహారం అంగన్వాడీల దయ. ప్రభుత్వం ఇచ్చే నిత్యావసరాల కోసం కొండలు దిగి మూడు కిలో మీటర్ల దూరంలోని పంచాయతీ కేంద్రం కూనేరుకు రావాల్సిందే. అలాగే, అటవీ ఉత్పత్తులు అమ్ముకోడానికి అష్టకష్టాలను ఓర్చుతూ ఐదు కిలో మీటర్ల దూరంలోని ఆంధ్ర సంతకు వెళ్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికీ చాలా మందికి ఆధార్, రేషన్ వంటి గుర్తింపు కార్డులు లేవు. పిల్లలు చదువుకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రుల బాటలోనే పయనిస్తూ పశువులు, మేకల కాపర్లుగా, బాల కార్మికులుగా మిగిలిపోతున్నారు. దశాబ్దాలుగా వీరిని ఏలుతున్న స్థానిక పాలకులూ గిరిజనులే అయినా ఈ గ్రామాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. రాజన్నదొర సుమారు ఇరవై ఏళ్లు, భంజ్‌దేవ్ పదిహేనేళ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నా ఈ గిరిజనుల బతుకుల్లో ఇసుమంత అభివృద్ధి కానరాలేదు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. తమగ్రామం అభివృద్ధి చెందుతుందని, తమ తలరాతలు మారుతాయని గిరిజనులు భావిస్తున్నారు.


ఎగువ మిర్తివలస గిరిజనులు

# ఆ ప్రాంతాలు కాఫీ తోటలకు అనుకూలం

- సాగు చేస్తే గిరిజనులకు ఎంతో మేలు
- ఆర్థికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం
- అధికారులు దృష్టిసారించాలంటున్న పరిశీలకులు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని గిరిశిఖర ప్రాంతాలైన జరడ, శిఖరపాయి, తోట, గొరటి కాఫీ తోటల పెంపకానికి అనువుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కాఫీ తోటలు పెంపకం చేపడితే గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఈ ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఐటీడీఏ అధికారులు, కాఫీ బోర్డు అధికారులు స్పందించి ప్రయోగాత్మకంగా ఈ కొండ శిఖర గ్రామాల్లో కాఫీ తోటలు పెంపకం చేపట్టాల్సిన అవసరం ఉంది. మంచి ఫలితాలు వస్తే మిగతా గ్రామాల్లోని వందలాది ఎకరాల అటవీ ప్రాంతంలో కాఫీ తోటలు వేసేందుకు అవకాశం ఉంటుంది. జరడ, శిఖరపాయి, తోట, గొరటి ప్రాంతాలకు రహదారి సౌకర్యం కూడా ఉంది. వాహనాల రాకపోకలకు అనువుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో కాఫీ తోటలు పెంపకం చేపడితే వాటికి సరిపడ వాతావరణం ఉందని, మంచి ఫలితాలు వస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు. 1991 నుంచి 1993 వరకు అప్పటి పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సోమేష్‌కుమార్ కాఫీ తోటల పెంపకానికి ప్రోత్సాహం అందించారు. ఈ తోటలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ మొక్కలను నాటారు. ఈ మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా మారాయి. వీటి నీడలో కాఫీతోటలు, మిరియాల పెంపకం కూడా జరుగుతుంది. ఇవి ఈ ప్రాంతంలోని అరకు, పాడేరు, చింతపల్లి గిరిజనుల స్థితిగతులను కూడా మార్చింది. గతంలో పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పనిచేసిన దమయంతి.. జరడ ప్రాంతం కాఫీ తోటల పెంపకానికి అనువుగా ఉంటుందని గుర్తించారు. అలాగే సాలూరులోని అదుకు పరిసర గ్రామాల్లో కాఫీ తోటలు పెంపకానికి ప్రయత్నించారు. ఇది కార్యరూపం దాల్చక ముందే ఆమె బదిలీపై వెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు కాఫీ తోటల పెంపకంపై దృష్టిపెట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జరడ, శిఖరపాయి, తోట, గొరటి ప్రాంతాల్లో కాఫీ తోటల పెంపకానికి ప్రయత్నించాలని గిరిజనులు కోరుతున్నారు.

### గంజాయి సాగు వదిలి.. కాఫీ సాగుకు ఉపక్రమించి..

పాచిపెంట: విశాఖ జిల్లా అరకు, అనంతగిరి ప్రాంతాల సమీపంలో ఉన్న సతాబి, తంగ్లాం గిరి శిఖర గ్రామాలు పాచిపెంట మండలం పరిధిలో ఉన్నాయి. అప్పట్లో అక్కడ గిరిజన రైతులు కొంతమంది గంజాయి సాగు చేసేవారు. అక్రమ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న తరుణంలో 1997లో అప్పటి టీడీపీ ప్రభు త్వం ఈ గ్రామాలపై దృష్టి సారించింది. వారికి మెరుగైన జీవనోపాధి కల్పించాలని అధికారు లను ఆదేశించింది. దీంతో అప్పటి ఐటీడీఏ పీవో దమయంతి ఆయా గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఆ ప్రాంతంలో గంజాయి సాగు చూసి ఈ విధమైన సాగును మానేయాలని రైతులకు సూచించారు. అక్కడ జీవన శైలి, అక్రమ గంజాయి సాగు గురించి టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందిస్తూ గిరిజన రైతులకు ప్రోత్సాహం అందిం చాలనే ఉద్దేశ్యంతో నాడు టీడీపీ ప్రభుత్వం గంజాయి సాగుకు గిరిజన రైతులు దూరమై కాఫీ తోటల పెంపకం చేపట్టారు. పండించిన కాఫీ గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేసేది.


ఏజెన్సీలోని కాఫీ తోట

### కాఫీ తోటలు పెంచాలి..

కొండ శిఖర ప్రాంతాలైన జరడ, శిఖరపాయి, తోట, గొరటి కాఫీ తోటలను పెంచాలి. అక్కడి వాతావరణం కాఫీ తోటల పెంపకానికి అనుకూలంగా ఉంటుంది. కాఫీ తోటల పెంపకంతో గిరిజన రైతులకు ఆర్థికంగా ఎంతగానో మేలు జరుగుతుంది.

-మండంగి రమణ,
గిరిజన సంఘం నాయకుడు


సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

# 'సంకల్పం' గీతంతో ప్రజల్లో చైతన్యం

- మాదకద్రవ్యాల నియంత్రణకు విస్తృత ప్రచారం
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా సంకల్పం గీతంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈమేరకు మంగళవారం ప్రత్యేకంగా రూపొందించిన సంకల్పం గీతం, పోస్టర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువత నుంచి వాటికి దూరం చేయడానికి జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. చెడు స్నేహాల ప్రభావం, ఒత్తిడితో డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడవద్దని డీ స్మార్ట్.. డోంట్ స్టార్ట్ అన్న నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన కాకర్ల గాంధీ మాస్టారు రాసి, స్వరకల్పన చేసిన సంకల్పం గీతాన్ని ఆవిష్కరించామన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాస్టారును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, విజయనగరం రూరల్ సీఐ డి.లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఆర్.వి.ఆర్.కె. చౌదరి, ఎస్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభ

- ధనుర్మాస మహోత్సవాలు, క్రిస్మస్‌తో సందడి
- హిందువులు, క్రైస్తవుల్లో ఉప్పొంగుతున్న భక్తిభావం
- పట్టణాలు, గ్రామాల్లో పండగ వాతావరణం


బొబ్బిలి సింగారపు వీధిలోని వైభవ వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

బొబ్బిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఒకపక్క ధనుర్మాస మహోత్సవాలతో హిందువుల్లో, మరోపక్క క్రిస్మస్‌లో భాగంగా క్రైస్తవుల్లో భక్తి భావం వెల్లివిరుస్తుంది. దీంతో పట్టణాలు, గ్రామాల్లో సందడి నెలకొంది. ఇప్పటికే ధనుర్మాసం ప్రారంభంకావడంతో వైష్ణవ ఆలయాల్లో ప్రతి రోజూ తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు రోజుకొకటి చొప్పున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిస్తున్నారు. అయ్యప్ప దీక్షపరులు పెద్దఎత్తున పూజలు, భజనలు వంటివి చేపడుతు న్నారు. మకర సంక్రాంతి వరకు హరికథ సంకీర్తనలు, మేలుకొలుపులు, భజనలు తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి, కంచరవీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, సిరిపురపు వీధిలోని వైభవవేంకటేశ్వరస్వామి, పాతబొబ్బిలి, గొర్లె సీతారాంపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, స్వామివారికి బేడా సేవ, కర్పూర హారతి, పాశుర విన్నపాలు, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణాలు, గోవిందనామాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 28న పూలంగి సేవ, 29న తులాభారం, జనవరి 3న విశేష దీపాలంకరణ సేవ, 8న పొన్నాకుల హారతి, 10న వైకుంఠ ఏకాదశి పర్వదినాన వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు, 11న విశేష ప్రసాద సేవ, 13న భోగి సందర్భంగా శ్రీ గోదా రంగనాథుల కల్యాణంతో ధనుర్మాస మహోత్సవాలు ముగుస్తాయి.


విద్యుత్ వెలుగుల్లో బొబ్బిలి సీబీఎం చర్చి

### చర్చిల్లో సందడి..

ఈ నెల 25 క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులంతా మినీ క్రిస్మస్‌ల పేరుతో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. బొబ్బిలి పట్టణంలోని 133 ఏళ్ల చరిత్ర కలిగిన సీబీఎం చర్చితో పాటు ఆర్‌సీఎం తదితర చర్చిలు విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్నాయి.

### భక్తిశ్రద్ధలతో పూజలు..

బొబ్బిలి పట్టణంలోని రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి, కల్యాణ వేంకటేశ్వర, వైభవ వేంకటేశ్వర, ఆంజనేయ, వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పల్లకిసేవ, గోదాదేవి పూజ, విష్ణుసహ స్రనామ పారాయణం, పాశురాల స్తోత్రం, గోవిందనామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందమాల ధరించిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

### వేణుగోపాలుడికి పల్లకి మహోత్సవం..

జామి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేటలో ఉన్న పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గోదాదేవికి పల్లకి ఉత్సవాన్ని ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న 'పాలకడలి'..

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువైన వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల్లో మంగళవారం పాలకడలిని ఘనంగా నిర్వహించారు. భక్తుల సహకారంతోనిఇర్వహించిన పాలకడలి దృశ్యం (శయన ఉత్సవం) అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో గోదాదేవికి పూజలు చేశారు.

### వైభవంగా ధనుర్మాస పూజలు..

సాలూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా రుత్వికులు నారాయణాచార్యులు, ఉదయాచార్యులు పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామార్చన, రెండో పాశుర విన్నపం, ద్రవిడవేద పారాయణం నిర్వహించారు. అలాగే స్వామికి పల్లకి సేవ చేపట్టారు, విశేష హారతి, మంత్రపుష్పం, తీర్థగోష్టి కార్యక్రమాలు, అమ్మవారికి మంగళాశాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దభక్తులు పాల్గొన్నారు.


కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో పల్లకి సేవ..


జామి మండలం అన్నంరాజుపేటలో శ్రీపుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో పల్లకి మహోత్సవం

### శివలింగాల తయారీ..

కొత్తవలస, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాశీలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 40 రోజుల పాటు నిర్వహించనున్న కుంభ మేళాలో కోటి శివలింగాల అర్చన కోసం లింగాల కొత్తవలస-కె.కోటపాడురోడ్డులోని పంచాయతన రామలింగేశ్వర ఆలయంలో శివ లింగాలను తయారు చేస్తున్నారు. ఇందు కోసం కాశీలోని గంగా నది నుంచి నల్ల మట్టిని సేకరించి ఇక్కడకు పంపించారు. లింగాల తయారీకి సంబంధించిన అచ్చులతో పాటు ప్రత్యేక ప్యాకింగ్ కోసం అవసరమైన సామగ్రిని నిర్వాహకులు పంపించారు. కొత్తవలసలోని శివాలయంలో 1500 మట్టి శివలింగాలను తయారు చేసేందుకు అవకాశం కల్పించడంతో రెండు రోజులుగా లింగాలను తయారు చేస్తున్నారు. మండలానికి సంబంధించి కొత్తవలసలోని శివాలయ యాజమాన్యం తమకు అవకాశం ఇవ్వాలని కోరడంతో మట్టిని, లింగాలకు సంబంధించిన అచ్చులను పంపించడంతో ఈ లింగాల తయారీని భక్తిశ్రద్ధలతో తయారు చేస్తున్నారు.

### పైడిమాంబకు ప్రత్యేక పూజలు..

విజయనగరం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడి మాంబకు మంగళవారం మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులోని వనంగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం ఉదయం 6.45 గంటలకు సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు. పైడిమాంబకు వివిధ రకాల పుష్పలతో ప్రత్యేకంగా అలంకరించారు. దానిమ్మ పండ్లను నైవేద్యంగా సమర్పించారు. నగరం, మండల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమాన్ని నిర్వహించారు.


వివిధ రకాల పూలతో పైడిమాంబకు ప్రత్యేకాలంకరణ, దానిమ్మ పండ్లతో నివేదన

న్యూస్ బాక్స్

## హెల్త్ అసిస్టెంట్లను కొనసాగించండి

పూసపాటిరేగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని సర్వీసులలలో కొనసాగించాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షులు టి.బి.ఎస్. వర్మరాజు ఒక ప్రకటనలో కోరారు. ఈ తొలగింపుల వల్ల ఉద్యోగులు, కుటుంబీకులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

## విశ్రాంతి భవనం ప్రారంభం

నెల్లిమర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేట శ్మశాన వాటికలో మద్దిల అన్నపూర్ణ, మురళీకృష్ణ తదితరులు సుమారు రూ.నాలుగు లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని నగర పంచాయితీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు లెంక అప్పలనాయుడు, రవ్వా నాని, బయిరెడ్డి కల్యాణ్‌చక్రవర్తి, ఎడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో మెరిసిన శాంతారావు



శాంతారావును అభినందిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు

విజయనగరం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం, గుణుపూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గేదెల శాంతారావు రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 3 పతకాలు సాధించారు. ఈ నెల 14, 15 తేదీల్లో గుడివాడలో జరిగిన పోటీల్లో శాంతారావు మాస్టరు 5 కిలోమీటర్ల నడక పోటీల్లో తొలి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 5 కిలోమీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం లోనూ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలు సాధించారు. శాంతారావును జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు సన్యాసిరాజు, హెచ్‌ఎం డీవీకే కృష్ణకుమారి, తదితరులు అభినందించారు.

## అనధికార నిర్మాణం తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట వాటర్ ట్యాంకు వద్ద మంగళవారం అనధికార నిర్మాణాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక అధికారులు తొలగించారు. వాటర్ ట్యాంకు ప్రాంతంలో అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి నిర్మాణం చేపడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అధికారులు అక్కడికి వెళ్లి తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి బృందం పాల్గొన్నారు.

## సబ్ జైలు పరిశీలన

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న సబ్‌జైలును జిల్లా న్యాయాధికారి కల్యాణ చక్రవర్తి, జిల్లా న్యాయసేవా ఆధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, వారికి అందుతున్న న్యాయసేవా సదుపాయం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీల తరఫున ప్రభుత్వం ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందని న్యాయాధికారి తెలిపారు. దీనికి ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు.

## క్షయ వ్యాధి రహిత దేశమే లక్ష్యం

కొత్తవలస, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత దేశంగా తీర్చి దిద్దడం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నట్టు టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తుమ్మికాపల్లిలో వైద్యాధికారి గోపాల కృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, ఉప సర్పంచ్ అడ్డూరి సతీష్, నీటి సంఘం అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ అప్పికొండ సన్యాసిరావు పాల్గొన్నారు.

## సంస్కృత కళాశాలతో ఒప్పందం

విజయనగరం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహారాజా సంస్కృత కళాశాలతో సెంచూరియన్ యూనివర్సిటీ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు విద్యా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. విద్యార్థులకు హిందూ ధర్మశాస్త్రాలలో ఉన్న నైతిక విలువలపై అవగాహన కల్పించడం, సమాచారం మార్పిడి, శిక్షణ తదితర అంశాలపై ముందుకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జనార్దన్‌నాయుడు, సెంచూరియన్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో ఎంతోమంది రైతులకు కలిగిన ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని.. వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. రైతులు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. మంగళవారం ధర్మవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్, నాయకులు జీఎస్ నాయుడు, లగుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా రైతు సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

### రెవెన్యూ రికార్డులను సరిచేయండి

చీపురుపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో తప్పుల తడకగా ఉన్న భూ రికార్డులను సరిచేయాలని కర్లాం గ్రామానికి చెందిన రైతులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో సుమారు రెండు వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. వీటిలో కేవలం 300 ఎకరాలకు మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకాలు, రికార్డులు ఉన్నాయని, తెలిపారు. మిగిలిన 1700 ఎకరాలకు రికార్డులు లేవన్నారు. దీని కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సంబంధిత భూ రికార్డులు తయారు చేసి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సదస్సులో తహసీల్దారు ఎన్.రాజారావు, సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, తెలుగుదేశం నాయకులు రౌతు కామునాయుడు, కెల్ల రామారావు, బాణాన రామకృష్ణ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, కూటమి నాయకులు

# రూ.156.93 కోట్లతో నగర పాలక బడ్జెట్



సమావేశానికి హజరైన కౌన్సిలర్లు. మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.156.93 కోట్లతో అధికారులు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.156.93 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను కమిషనర్ పల్లె నల్లనయ్య సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌పై పలువురు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను తెలిపిన అనంతరం ఏకగ్రీవ ంగా ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వచ్ఛంద విరాళాలతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్) నిధులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రూ.72.45 కోట్లతో నగర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్టు చెప్పారు. రూ.10 కోట్ల సాధారణ నిధులతో కొత్త రోడ్లు, రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. రూ.కోటితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.1.50 లక్షలను హార్టికల్చర్, నగర సుందరీ కరణకు కేటాయించినట్టు తెలిపారు. సమా వేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చి లయ యాదవ్, ఫ్లోర్‌లీడరు ఎస్‌వీవీ రాజేష్, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కార్పొరేటర్లు అల్లు చాణక్య, కేదారశెట్టి సీతారామమూర్తి, రేగాన రూపాదేవి, బాలి పద్మావతి, ఆనందరావు, శ్రీనివాసరావు, వింత ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

# మంత్రి దృష్టికి రెవెన్యూ సమస్యలు

రాజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్నంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనితలను సత్కరించారు నియోజకవర్గానికి సంబంధించిన రెవెన్యూ సమస్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



మంత్రులతో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

### జోనల్ రెవెన్యూ సదస్సులో..

భోగాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ రెవెన్యూ సదస్సులో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. తారక రామతీర్థసాగర్, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనిత, నెల్లిమర్ల, విజయనగరం ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.




మంత్రి సత్యప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

## ఘనంగా పింఛనుదారుల దినోత్సవం

విజయనగరం టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారుల వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీజీఈపీ) ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా శాఖ కార్యాలయంలో 42వ పింఛనుదారుల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామచంద్ర పండా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 75 ఏళ్లు నిండిన పింఛనుదారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా కార్యదర్శి బలివాడ బాల భాస్కరరావు, సీనియర్ కామ్రేడ్ పీవీ రమణ, సబ్ ట్రెజరీ అధికారి రమేష్, ప్రధాన కార్యదర్శి ఎంపీ తిరుపతిరావు, కోశాధికారి ఎస్.కామేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో...

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తహసీల్దారు కార్యాలయం సమీపంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆల్ ఇండియా పెన్షన్‌దారుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి నారాయణల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ..నివాళులర్పించారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

### విజయోత్సవ సభ

గజపతినగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎస్.సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత పింఛనుదారుల విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పింఛనుదారులు తదివతరులు పాల్గొన్నారు.

## అంచనా బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం

రేగిడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్‌కు సంబంధించి 2024-25 సంవత్సరానికి అంచనా, సవరణ బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ ఎంపీపీ టెంకాల అచ్చంనాయుడు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌ను సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ సభ్యులకు చదివి వినిపించారు. ఇదిలా ఉండగా.. ఉపాధి అంచనా, సవరణ బడ్జెట్‌లపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఏడాది లేబర్, మెటీరియల్ ఖర్చుల కింద రూ. 26 కోట్లు కేటాయించినట్లు ఎంపీడీఓ శ్యామలా కుమారి చెప్పగా సభ్యులు అడ్డుతగిలారు. మండల పరిషత్. పంచాయితీల అనుమతి లేకుండా పనులు బడ్జెట్‌లో పొందుపరచటం ఎంతవరకు సమంజసమని వైస్ ఎంపీపీలు టెంకాల అచ్చంనాయుడు, జగన్మోహనరావులు ఎంపీడీఓను ప్రశ్నించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు.

### అవకతవకలపై విచారణ

రేగిడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండవలస పంచాయతీలో అవకతవకలు జరుగుతున్నాయని, సర్పంచు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఫిర్యాదుపై చీపురుపల్లి డీఎల్‌పీఓ మోహనరావు మంగళవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 2021లో సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తుమ్మి వెంకటరమణ 2023 జూన్‌లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో వైస్ సర్పంచ్ బేరి మోహనరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన మెజారిటీ సభ్యులతో సంబంధం లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నట్టు గ్రామానికి చెందిన రాళ్లబండ శంకరరావు, బుగత ఉమామహేశ్వరి, బెవర అప్పలనాయుడు తదితరులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పిఓ, కార్యదర్శి తులసి విచారణ చేపట్టారు. ఫిర్యాదుచేసిన ఇద్దరు సభ్యులు గైర్హాజరు కాగా, మిగతా ముగ్గురు వారి వాదన వినిపించారు. ఉపసర్పంచ్ తన హయాంలో తీర్మానాల ప్రాప్తికి పనులు చేసినట్టు డీఎల్‌పీఓకు నివేదించారు. 2021 నుంచి ఇప్పటి వరకు ఉన్న పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని డీఎల్‌పీవో తెలిపారు.

### కొండచిలువ హతం

దత్తిరాజేరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎం.లింగాలవలస గ్రామ సమీపంలో 10 అడుగుల కొండ చిలువను గ్రామస్థులు మంగళవారం ఉదయం హతమార్చారు. స్థానిక పెద్ద చెరువు నుంచి రోడ్డుపైకి వస్తుండగా రైతుల కంటపడింది. భయాందోళనకు గురై, దానిని హతమార్చారు.

## చార్జీలు రద్దు చేసే వరకూ పోరాటం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూ ఆప్ ఛార్జీలు రద్దు చేసే వరకూ పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ భవన్ వద్ద మంగళవారం బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అదానీకి లాభాలు అందిస్తూ.. ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ట్రూ అప్ చార్జీలు రూ.16,800 కోట్లు ప్రజలపై వేశారని అదానీ స్మార్ట్ మీటర్లు ఇంటింటికి బిగుస్తున్నారని ఆరోపించారు. చార్జీలు ఉపసంహరించేంత వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, శ్రీను, పాపారావు, జగదాంబ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తవలసలో..

కొత్తవలస, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని జిల్లా సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తవలస జంక్షన్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద సీపీఎం కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు విద్యుత్ చార్జీలను పెంచారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, శ్రీనివాసరావు, అప్పలరాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కురుపాం/కురుపాం రూరల్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలోని జోగిరాజు పేట సమీపంలో కిచ్చాడ వెళ్తున్న రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోనకరంగా ఉంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మంగళవారం రాత్రి జియ్యమ్మవలస మండలంలోని కన్నపుదొరవలసకు చెందిన బంగారు నాగార్జున(33), కురుపాం మండలంలోని కిచ్చాడకు చెందిన నిమ్మక కైలాష్(27) ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వస్తున్నారు. కిచ్చాడ వెళ్తున్న రోడ్డులో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు రోడ్డు పై పడిపోవడంతో స్థానికులు స్పందించి కురుపాంలోని ఆసుపత్రికి తరలించారు. వీరిలో బంగారు నాగార్జునకు తలపై తీవ్ర గాయంకావడంతో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. 108లో పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### గంజాయితో ఇద్దరి అరెస్టు

విజయనగరం క్రైం, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ ప్రసన్న కుమార్, సిబ్బందితో కలసి గూడ్స్ షెడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉడా కాలనీకి చెందిన చప్పా పవన్ కల్యాణ్, వీటీ అగ్రహారానికి చెందిన వెలగడ మురళీలను పట్టుకున్నట్టు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్టు వారు అంగీకరించారని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

### ఆటో చోరీ

భోగాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చాట్లపేటకు చెందిన చాట్ల రాంబాబుకు చెందిన ఆటో (ఏపీ35 డబ్ల్యు 7392) చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.పాపారావు మంగళవారం తెలిపారు.

### సవరవల్లిలో బైక్..

సవరవల్లి గ్రామానికి చెందిన బోర గణేష్‌కు చెందిన కొత్త పల్సర్ బైక్ చోరీకి గురైంది. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.సూర్యకుమారి మంగళవారం తెలిపారు.

### 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని చినబగ్గ సమీపంలో గల కొండ ప్రాంతంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి 300లీటర్ల పులిసిన బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీ, విక్రయం, రవాణా వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అమ్మన్నరావు హెచ్చరించారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

డెంకాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం డి.కొల్లాం గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.66,470 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

# గెడ్డవలసలో వైద్య శిబిరం



గ్రామంలో సేవలు అందిస్తున్న వైద్య బృందం

రాజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గెడ్డవలస గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, సిద్ధేశ్వర్‌లు మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 'మంచం పట్టిన గెడ్డవలస' అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. గ్రామంలోని 72 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు. ఇంటింటికి వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరించారు. డ్రమ్ములలో నిల్వ ఉంచిన నీటిని తాగడం వల్ల ప్రజలు రోగాల భారిన పడుతున్నారని గుర్తించారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు సచివాలయ సిబ్బందితో కలసి గ్రామంలో జ్వరపీడితులను గుర్తించారు. కాలువల్లో పూడికలు తీయించి బ్లీచింగ్ చల్లించారు. అదనపు డీఎంహెచ్‌ఓ సత్యనారాయణ తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత స్పందించి సకాలంలో గెడ్డవలస ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించినట్టు జిల్లా అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## 'మాయాజాలం'పై కలెక్టర్ సీరియస్

మెంటాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనుల్లో అవకతవకలును కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డుమా ప్రాజెక్టు డైరెక్టర్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో ఈ మండలానికి సంబంధించిన పనులపై తక్షణమే నివేదిక అందజేయాలని స్థానిక ఎంపీడీవో, ఏపీవోను పీడీ ఆదేశించారు. 'ఉపాధి పనుల్లో మాయాజాలం' శీర్షికతో ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆరా తీసిన కలెక్టర్...తగిన చర్యలు తీసుకోవాలని పీడీకి సూచించారు. ఈ కథనం నేపథ్యంలో జిల్లాలోని ఏఏ మండలాల్లో ఈ తరహా మాయాజాలం చోటుచేసుకున్నదీ... ఎక్కడెక్కడ యంత్రాలను వినియోగించిందీ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## క్రీడల్లో విజేతలకు అభినందన

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్ క్రీడల్లో విజేతలను జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం తన నివాసంలో అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కోచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్సీ రఘురాజు

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన కానిస్టేబుల్



రామకృష్ణను అభినందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కానిస్టేబుల్ అల్లు రామకృష్ణ కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో సత్తాచాటాడు. ఈ మేరకు నాలుగు బంగారు పతకాలు సాధించాడు. దీంతో రామకృష్ణను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్‌ఐలు శ్రీరాములు, నాయుడు అభినందించారు.

## మినీ గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మక్కువ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి కోరారు. మంగళవారం మండలంలోని పనసభద్ర, దుగ్గేరు గ్రామాల్లో గోకుల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోకులాల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్ మాదిరిగానే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.అనంతరం గిరిశిఖర గ్రామం బాగుజోలలో ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. ఇక్కడ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నాడు-నేడు కింద నిధులు మంజూరుకావడంపై అడిగితెలుసుకున్నారు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

సీతంపేటరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని డిప్యూటీ డీఈవో కె.నారాయడు తెలిపారు. మంగళవారం మండలంలోని టిటుకుపాయిగూడలో గల జీపీఎస్ పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులసామర్థ్యాన్ని పరిశీలించారు.పాఠ్యాంశాలు అర్థంకాకపోతే ఉపాధ్యాయు డిని అడిగితెలుసుకోవాలని కోరారు. అలాగేకోతాం పంచాయతీ పరిధిలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో కె.గీతాంజలి పరిశీలించారు.

## గిరిజన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి కోరారు. విశాఖ సమీపంలోని రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం పాడేరు, పార్వతీపురం, సీతంపేట, చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వెలుగు, జీసీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌ధన్ వికాస కేంద్రాల సభ్యులకు అందించిన శిక్షణ, ఉత్పత్తులు, భవన నిర్మాణాలు, మౌలిక యంత్ర పరికరాల కొనుగోలుపై సమీక్షించారు. వీడీవీకేలు చేస్తున్న ఉత్పత్తులు, మార్కెటింగ్ సదుపాయాలను బలోపేతం చేయాలని ఆమె ఆదేశించారు. సేకరించిన అటవీ ఉత్పత్తులకు అదనపు విలువలు జోడించి, మంచి బ్రాండింగ్ చేయాలని సూచించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లను పరిశీలించి నిర్ణయించిన ధరలను తెలుసుకున్నారు. సింహాచలం, తిరుమల తిరుపతి దేవస్థానాలకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## శివడవలసలో మేలుకొలుపు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శివడవలసలో మంగళవారం రామలింగేశ్వర భజన బృందం సభ్యుడు కిల్లన సత్యనారాయణ ఆధ్వర్యంలో ధనుర్మాసం పురస్కరించుకుని మేలుకొలుపు ప్రారంభించారు. శివాలయం నుంచి రామలింగేశ్వర భజన బృందం సభ్యులుభజనలు చేస్తూ మేలుకొలుపు చేస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు శంబంగి రామారావు, పెద్దింటి నారాయణరావు, పట్నాన తవిటయ్య, యండ్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

● బొబ్బిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రవచన మండపంలో విజయవాడకు చెందిన ప్రవచనకర్త తూపురాణి పద్మావతి తిరుప్పావై ప్రవచనాలను ధనుర్మాసం పురస్కరించుకుని భక్తులకు వివరించారు. గోదాదేవి భక్తి ప్రాశస్త్యాన్ని, ధనుర్మాస విశిష్టతను తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని వేణుగోపాలస్వామి భక్తసంఘం, ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నీటి సంఘాలతో రైతులకు మేలు: కళా



నీటి సంఘం అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలతో ఆయకట్టుదారులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తెలిపారు. మంగళవారం తనను కలిసిన నీటి సంఘం ఛైర్మన్లు, వైస్ చైర్మన్లను అభినందించారు.అనంతరం సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్మీ జవాను బందపు ఈశ్వరరావు మృతికి ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, తాడ్డె సన్యాసినాయుడు, సారేపాక సురేష్, బలరాం, వెన్నె సన్యాసినాయుడు, జనసేన నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు: కలెక్టర్



ధాన్యం మండీ ప్రారంభిస్తున్న కలెక్టర్

రాయగడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు, దళారులకు నమ్మి మోసపోవద్దని కలెక్టర్ పారుల్ పట్వారి కోరారు. మంగళవారం రాయగడలోని రెగ్యులేటడ్ మార్కెట్ కమిటీ (ఆర్ఎంసీ) ప్రాంగణంలో ధాన్యం మండీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యం మండీల్లో విక్రయించి ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధరను పొందాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఆర్ఎంసీ ప్రాంగణంలో తాము తెచ్చిన ధాన్యం ఉంచుకునేందుకు వసతులు లేవని, సరైన టార్పాలిన్లు, షెడ్లు, గోదాములు లేవని తాము తెచ్చిన ధాన్యం అమ్మేవరకు ఎవరు రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ముఖ్య పౌరసరఫరాల అధికారి దాశరథి సౌరెన్, బనగాడి తిరుపతి, డీఆర్సీ ఎస్.సీతాపతి, కరుణకర్ మజ్జి, కస్తూరి సన్యాసి రాజు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవాలి




కార్యక్రమంలో పాల్గొన్న కొండబాబు

రాయగడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవుడు సుఖసంతోషాలతో జీవించడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడం మన బాధ్యత అని బీజేపీ నాయకుడు వై.వెంకటేశ్వరరావు (కొండబాబు) తెలిపారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో మానవ హక్కుల రక్షణ సంస్థ రాయగడ శాఖ అధ్యక్షుడు బిభుతిభూషన్ పరిడ అధ్యక్షతన అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అటానమస్ కళాశాలప్రిన్సిపాల్ బాబిలత షారాఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకున వాటికి భంగం వాటిల్లితే కాపాడుకోవడానికి వెనుకంజ వేయరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది రవి శత్పథి, ఉదయనాథ్ నాయక్, మానస రంజన్ రథ్, రుద్రకాంత్ సేనాపతి పాల్గొన్నారు.

## మజ్జిగౌరి అమ్మవారికి పూజలు

రాయగడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):రాయగడలోని మజ్జిగౌరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సబ్‌కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, తహసీల్దారు ప్రియదర్శిని స్వాయి, ఆలయ ట్రస్టు సభ్యులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు.

## మరమ్మతులు లేక.. గోతులు పూడ్చక

● ఇదీ పార్వతీపురం -పాలకొండ వైపు వెళ్లే రహదారిపై కల్వర్టుల వద్ద పరిస్థితి



కోటవానివలసలో గొయ్యి వద్ద కల్వర్టుపై కొమ్మలు, రాళ్లు ఏర్పాటుచేసిన దృశ్యం

గరుగుబిల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పలు కల్వర్టులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఈ మార్గంలోని కోటవానివలస, ఉల్లిభద్ర, సుంకి, సంతోషపురం, రావివలస ప్రాంతాల్లో గతంలో నిర్మించిన కల్వర్టుల వద్ద గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదభరితంగా తయారయ్యాయి. భారీ వాహనాలు రాకపోకల వల్ల కల్వర్టుల పైభాగంలో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దీనికితోడు కల్వర్టులకు ఇరువైపులా కోతకుగురవడంతో ఏపాటి ఏమరపాటునా ఉన్నా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. కోటవానివలస వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టుపై వాహనచోదకుల కోసం హెచ్చరికగా రాళ్లు, కొమ్మలను ఏర్పాటుచేశారు. ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత రాకపోకలుసాగించే చోదకులు భయాందోళనకు గురవుతున్నారు.ప్రధాన రహదారి మార్గంలో పలుచోట్ల చిన్నపాటి గోతులనుపూడ్చారు తప్ప భారీగోతులను పూడ్చలేదని పలువురు వాపోతున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు భారీ గోతులతోపాటు ప్రధాన కల్వర్టులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## నీటి సంఘాల అధ్యక్షులకు అభినందన



నీటి సంఘాల అధ్యక్షులను అభినందిస్తున్న తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మండలంలోని నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పాడి సుదర్శనరావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మండలంలోని నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## రాయగడ జమ్ములో పంట కోత ప్రయోగం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయగడ జమ్ములో పంటకోత ప్రయోగం రైతు పువ్వల రామారావు పొలంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఈఎఫ్ఆర్ పి.యశోద, గీత, జగదీష్, పి.సురేష్, పి.రామారావు, ప్రశాంత్, సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ జి.మురళీమోహన్ పాల్గొన్నారు.

## ఆధార్ స్పెషల్‌డ్రైవ్ వినియోగించుకోండి

● గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి రామ్‌గోపాల్



మాట్లాడుతున్న రామ్‌గోపాల్

కురుపాం, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి):ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సచివాలయ సిబ్బంది వినియోగించుకోవలని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి బి.రామ్‌గోపాల్ కోరారు. మంగళవారం కురుపాంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఆధార్ స్పెషల్‌డ్రైవ్‌పై గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, సచివాలయాల్లో డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యూఎన్‌రోల్‌మెంట్ ఆధార అప్లికేషన్ ప్రక్రియను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సమన్వయంతో చేసుకోవాలన్నారు.

## పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని సీబీఎం బాలికోన్నత పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయాలని పలువురు వక్తలు కోరారు. మంగళవారం బొబ్బిలిలో ప్రజా, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్కూల్ గుర్తింపు రెన్యువల్ చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారయ్యే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి అధ్యక్షులు వి. శ్రావణకుమార్, మన్యం జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఏపీ విద్యార్థి జేఏసీ పట్టణ నాయకులు ఎం.శేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కె చంటి పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేయండి: సీఐ



మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలని సీఐ కటకం సతీష్ కుమార్ కోరారు. అనుమానాస్పద నడవడిక (సస్పెక్ట్ షీటు) ఉన్న వారి ప్రతి కదలికపైనా ఓ కన్నేసి ఉంచాలని ఆదేశించారు. బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో మంగళ వారం బొబ్బిలి పట్టణ, మండలంలో పనిచేస్తున్న మహిళాపోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, అక్రమ మద్యం వ్యాపారం, గంజాయి, డ్రగ్స్ వినియోగం, అమ్మకం, రవాణా, జూదంపై ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ జి.భాస్కరరావు పాల్గొన్నారు.

## నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

బాడంగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ 2047 నాటికి అభివృద్ధి చెందిన నవ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించడానికి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేలా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను సీఎం చంద్రబాబు రూపొందించారని తెలిపారు.

## తాగునీటి పైపులైన్ల పనుల పరిశీలన

బొబ్బిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపాలిటీలోని తారకరామాకాలనీలో వార్డు పర్యటనలో భాగంగా మంగళవారం కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళవారం పర్యటించి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాలు తదితర వాటిపై ఆరాతీశారు. ఇక్కడ తాగునీటి పైపులైన్ల పనులను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న పాత డిస్ట్రిబ్యూషన్ లైన్లను తొలగించి కొత్త లైన్లను వేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.నంతరం బొబ్బిలి-పార్వతీపురం-రామభద్రపురం స్టేట్ హైవేలో గల సెంట్రల్‌డివైడర్, ఫ్లైఓవర్‌పై పెయింటింగ్ పనులను పరిశీలించారు. ఆమె వెంట డీఈఈ కిరణ్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి ఉన్నారు.

## సీనియర్ సిటిజన్లకు అండగా నిలుస్తాం

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల అండగా నిలుస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మంగళవారం బొబ్బిలిలోని శ్రీకళాభారతి ఆడిటోరియంలో ప్రభుత్వరిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ అధ్యక్షతన జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను సమాజానికి సొత్తుగా పరిగణించాలన్నారు.రాష్ట్రంలో గత పాలకులు ఆర్థిక విధ్వంసానికి పాల్పడడంతో దానిని చక్కదిద్దే బాధ్యతను ప్రజలు చంద్రబాబుకు అప్పగించారన్నారు. అనంతరం 70 ఏళ్ల వయస్సు నిండిన సీనియర్ పెన్షనర్లనుసన్మానించారు. కార్యక్రమంలో సంఘనాయ కులు పోల సత్యంనాయుడు, ఎల్.జగన్నాథం, రెడ్డి కృష్ణమూర్తి, గేనా అప్పారావు,బొత్స సత్యనారాయణ, గేదెల చంద్రినాయుడు, కొటికలపూడి రాజేశ్వరి, చప్ప తిరుపతినాయుడు, పోల వెంకటఅప్పలనాయుడు, కళాభారతి ప్రతినిధి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

● కురుపాం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కురుపాంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టి.పాండురంగ అధ్యతనజాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శోభరాణి మాట్లాడుతూ పెన్షనర్లు రిటైర్ అయ్యామన్న భావన లేకుండా ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని కోరారు.కార్యక్రమంలో ఎస్‌టీవో కె.శంకరరావు, స్టేట్ బ్యాంక్ మేనేజర్, సంఘనాయకులు టీవీఎస్ సోమయాజులు, రామకృష్ణ, జి.దాలినాయుడు పాల్గొన్నారు.

● వీరఘట్టం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రిటైర్డ్ టీచర్ డి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకుని ఏపీఎస్‌జీఈఏ మండల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా పాలకొండ ఎస్‌టీవో ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలో సంఘాలు లేకపోతే సమస్యలు పరిష్కారం కావన్నారు. ఈసందర్భంగా 80 సంవత్సరాలు దాటిన పెన్షన్లను సన్మానించారు.

● పాలకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం అన్ని ఆసుపత్రుల్లో కల్పించాలని విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ కేవీ రమణమర్తి, సంఘ అధ్యక్షుడు కె.చౌదరినాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.

## 700 గోకులాల నిర్మాణానికి చర్యలు

● పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమణ

రామభద్రపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆడ పెయ్యిలు జననాలు పెంచడానికి కొత్తరకం వ్యాక్సిన్ల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైవీ రమణ తెలిపారు. జిల్లాలో 700 గోకులాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం మండలంలోని ఆరికతోట పంచాయతీ జగన్నాథపురంల పాడిరైతులకు మందులు పంపిణీ చేశారు. బ్రూసిల్లోసిస్ వ్యాక్సిన్ ద్వారా పుట్టిన ఆడపెయ్యిని పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ సరోగసి పద్ధతిలో ఒకఅండాన్ని వేరొక ఆవుకు ఎక్కించడం ద్వారా ఈ పెయ్యిలజననాలు పెంచడానికి చర్యలు చేపట్టామని, దీంతోఅబార్షన్లు లేకుండా పెయ్యిలు జన్మించవచ్చని తెలిపారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ వ్యాక్సిన్ ద్వారా జననం చేసిన ఆడ పెయ్యికి విజయ అని నామకరణం చేసినట్లు చెప్పారు. అక్టోబరు 20న ప్రారంభించిన 21వ జాతీయ పశుగణన ఫిబ్రవరి 20 వరకు జరుగు తుందని, 5 లక్షల 12వేల గృహాలను సర్వే చేపడతామని,ఇప్పటివరకు 2 లక్షల 50 వేల 436 గృహాలను సర్వే చేశామని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ జి.రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ విష్ణు, వైద్యాధికారులు జగదీష్, సురేష్ పాల్గొన్నారు.

● విజయనగరం,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా పిండ గర్భధా రణ ప్రక్రియ ద్వారా గిర్‌జాతి ఆడదూడ జననానికి కృషిచేసిన ఆరికతోట పశువైద్యులను ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం అభినందించారు. రామభద్రాపురం మండలంలోని ఆరికతోట పశు వైద్యుడు సురేష్ జగన్నాథపురంలో ఈఏడాది మార్చి తొమ్మిదో తేదీన గిర్‌ఆవుజాతి పిండాన్ని స్థానికంగా ఎంపికచేసిన ఓ సంకర జాతి ఆవులో ప్రవేశపెట్టారు. పిండాన్ని ప్రవేశపెట్టిన ఆవు ఈనెల 15న ఆరోగ్యవంతమైన గిర్‌జాతి ఆడదూడకు జన్మనిచ్చింది. ఇటువంటి ప్రయోగం ఉత్తరాంధ్రలోనే తొలి సారిగా విజయవంతం కావడం జిల్లాకు గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి ప్రక్రియను పాడి రైతులు పాటించాలని కోరారు. తద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధికి తోడ్పడిన వారవుతారని పేర్కొన్నారు.

## 'ఆర్‌జీఎల్ 7039'తో అధిక దిగుబడి

పాలకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం నూతనంగా రూపొందించిన ఆర్‌జీఎల్-7039 వరివంగడంతో అధిక దిగుబడి లభిస్తుందని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. పాలకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూఆర్‌జీఎల్ 7039 విత్తనాన్ని ఎంపీటీయూ- 106, ఎంటీయూ- 1075తో సంకరం చేశారని తెలిపారు. ఈవంగడానికి విధమైన చీడపీడలు ఆశించలేదని, కాండం దృఢంగా ఉండడంవల్ల దోమపోటును తట్టుకుంటుందని పేర్కొన్నారు.

## సంస్కృతిని పరిరక్షించుకోవాలి

నెల్లిమర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతిని మనమే పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని విజయనగరం మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల అధ్యాపకుడు టి.రమణ తెలిపారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ప్రాచీన భారతీయ విజ్ఞానం (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్)- సంస్కృతం- సంస్కృతి అన్న అంశంపై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ కన్వీనర్ డాక్టర్ దేవికారాణి, ఐక్యూఏసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

రేగిడి, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి): యువత, పెద్దలు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర పిలుపునిచ్చారు. ఆమదాలవలసలో సంకల్పం పేరుతో మంగళవారం రాత్రి మత్తు పానీయాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ నీలావతితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## పొనుగుటివలస సెంటర్‌లో వాహనాల తనిఖీ

సంతకవిటి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పొనుగుటివలస సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేశారు.ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

## 26 వరకు గడువు పెంపు

రాజాం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించేందుకు ఈనెల 26 వరకూ గడువు పెంచినట్లు హిందీ ప్రచారక్ కొండవలస మధుసూదనరావు తెలిపారు. వివరాలకు 9949917365 నెంబర్‌కు సంప్రదిం చాలని సూచించారు.

## కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

నెల్లిమర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 బేస్ బాల్ పోటీల్లో నెల్లిమర్ల కస్తూరిబా గాంధీ విద్యాలయ ఇంటర్ విద్యార్థిని వైగురుచందన ప్రతిభచూపింది. ఈమేరకు తృతీయ బహుమతి సాధించింది.



## 22న తోటపల్లి ట్రస్టు బోర్డు సమావేశం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి దేవస్థానం ట్రస్టు బోర్డు సర్వసభ్య సమావేశం జనవరి 22న జరుగుతుందని బోర్డు సభ్యులు తెలిపారు. ఈ మేరకు బోర్డుసభ్యులు కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిశారు. ఈసందర్భంగా నూతన ఆలయాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను వివరించారు.

## గిరిజన విద్యార్థి మృతి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడంకార్జా గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎగువ మంత్రజల గ్రామానికి చెందినపత్తిక దినేష్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దినేష్ దసరా సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. పచ్చకామెర్లు, రక్తహీనత, కిడ్నీకి సంబంధించిన వ్యాధులతో బాధపడేవాడని చెప్పారు. ఈ నేపథ్యంలో దినేష్‌ను కేజీహెచ్‌లో చేర్పినా ఫలితం దక్కలేదని తెలిపారు.

## 81 మందికి కంటి పరీక్షలు

వీరఘట్టం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టిపుడివలస జంక్షన్‌లో సత్యసాయి నిత్య అన్నపూర్ణసేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో కంటిరోగులకు పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ వైద్యులు కె.సురేష్ 81 మందికి పరీక్షలు చేసి, 42మందికి క్యాటరాక్ట్ సర్జరికి సిఫార్సు చేశారు.

## అడవులను కాపాడాలి

సీతానగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అడవులను కాపాడితే పర్యావరణం బాగుంటుందని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి చిరంజీవి చౌదరి తెలిపారు. మంగళవారం పార్వతీపురంలో జిల్లా అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అడవుల సంరక్షణపై గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుచ్చిమి రేంజ్ పరిధిలో ఏనుగుల సంరక్షణ ప్రాంతాన్ని సందర్శించారు. ఆయన వెంట సీసీఎఫ్ ఎం.దివాన్, డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన, రామ్ నరేష్, బీట్ అధికారి మనోజ్‌కుమార్ ఉన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ కోరారు. బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు బుధవారం నుంచి ఈనెల 20 వరకు నూర్పులను వాయిదా వేసుకోవా లని కోరారు.

● బాడంగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో కె. శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.రానున్న ఐదు రోజుల్లో వర్షసూచన నేపథ్యంలో రైతులు పొలంలో పనలు కుప్పలు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

## హాజరు పక్కాగా వేయాలి

బాడంగి,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు పక్కావేయాలని, సచివాలయాల్లో మూమెంట్ రిజిస్టర్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. మంగళవారం బాడంగిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈసందర్భంగా జియోట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్, ఎన్‌పీసీఐ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేపై పురోభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు.

## సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన

బొబ్బిలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పిరిడిలో మంగళవారం ప్రధానమంత్రి సోలార్ ఘర్ యోజన పథకంలోభాగంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ట్రాన్స్‌కో అధికారులు అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఈ అనంతరావు, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ బి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.